క్లుప్తంగా

కమిషనర్ వెంకట్రామ్ బదిలీ



తుక్కుగూడ: తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ జల్‌పల్లి మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. 23 నెలలుగా ఆయన సమర్థవంతమైన విధులు నిర్వహించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటు.. సంపూర్ణ పారిశుద్ధ్య మున్సిపాలిటీగా తీర్చిదిద్ది, ప్రజల మన్ననలు పొందారు. వెంకట్రామ్ స్థానంలో జల్‌పల్లి పుర కమిషనర్ వాణిరెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నారు.

నూతన నియామకం



నూతన కమిటీ సభ్యులతో గోపాల్‌రెడ్డి

మీర్‌పేట: కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించి, ఆదర్శంగా తీర్చిదిద్దుతానని సెవన్ హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు లక్ష్మణ్ రాథోడ్ అన్నారు. ఆదివారం ఎన్‌టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యవర్గ సభ్యుడు సామిడి గోపాల్‌రెడ్డి సమక్షంలో కాలనీ నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మణ్, గౌరవ అధ్యక్షుడిగా జగదీష్, ప్రధాన కార్యదర్శిగా రామాంజనేయులు, కార్యదర్శులుగా హరికృష్ణ, ఎస్.శ్రీనివాస్, రాజిరెడ్డి, కోశాధికారిగా ఏడుకొండలు, గౌరవ సలహాదారుడిగా డి.మహేశ్, ఎగ్జిక్యుటీవ్ సభ్యులుగా గోపాల్‌కృష్ణ, రమేష్ నాయక్, ప్రవీణ్‌శర్మ, బాషానాయక్, శ్రీనివాస్‌లను నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను కాలనీ వాసులు సన్మానించారు. కార్యక్రమంలో స్థానికులు చరణ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, పండరీ, మణిపాల్‌రెడ్డి, లక్ష్మణ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత ఉత్సవ కమిటీ ఎన్నిక

కందుకూరు: మండల పరిధిలోని దాసర్లపల్లిలో దుర్గామాత ఉత్సవ కమిటీ నూతన అధ్యక్షుడిగా జంబుల శివరాంరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో దుర్గామాత ఉత్సవ కమిటీని ఎన్నుకొని ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా మీగడి నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా కందూరి యుగేంధర్‌గౌడ్‌ను నియమించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శివరాంరెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీపంచముఖ హనుమాన్ రామలింగేశ్వర దేవాలయ కమిటీ అధ్యక్షుడు దయాకర్, స్థానిక నాయకులు పి.అశోక్, ఎం.శేఖర్, శ్రీగాది విష్ణు, పి.జంగయ్య, ఎస్.యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యా కమిషన్ సభ్యుడికి సన్మానం



వెంకటేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్: తెలంగాణ విద్యా కమిషన్ సభ్యుడు చారగొండ వెంకటేశ్‌ను యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కేతావత్ స్టాలిన్ కిషన్, వార్డు మాజీ సభ్యులు తులసీరాం, రమేశ్‌నాయక్, తులసీరాం నాయక్, నర్సింహగౌడ్ తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మాడ్గుల: మండల కేంద్రంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సూదిని ధర్మారెడ్డి జ్ఞాపకార్థంగా, నక్షత్ర మహా ఈఎన్‌టీ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతం అయింది. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు నిధిన్, రమని, క్లబ్ అధ్యక్షుడు సుమన్, నాయకులు విష్ణు నేత, విష్ణు వర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్డు..
ప్రయాణికుల పాట్లు

గుంతల రోడ్డుతో వాహనదారుల అవస్థలు..
- మురుగు ప్రవాహంతో దుర్వాసన
- ఇబ్బంది పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

పహాడీషరీఫ్: కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో కొరవడిన అధికారుల పర్యవేక్షణ, నాణ్యత లోపం వెరసి అనతి కాలంలోనే అవి ధ్వంసం అవుతున్నాయి. ప్రజాధనం వృథా అవుతోంది. రెండేళ్ల క్రితం జల్‌పల్లి పురపాలక ఎర్రకుంట నుంచి పహాడీషరీఫ్ వరకు రూ.8 కోట్లు వెచ్చించి నిర్మించిన రహదారి గుంతల మయంగా మారింది. దీనికి తోడు మురుగు జలాలు పారుతుండటంతో రోడ్డు చిత్తడిగా మారి.. మురికి కూపాన్ని తలపిస్తోంది. మున్సిపాలిటీలోని ప్రధానమైన శ్రీశైలం రహదారి కావడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది.



షాహిన్‌నగర్ రోడ్డు దుస్థితి

ఏడాదంతా మురుగే..

షాహిన్‌నగర్ హుడా పాఠశాల ప్రాంతంలోని రహదారిపై ఏడాది పొడవునా మురుగునీరు పారుతుండడంతో వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. మురుగు ప్రవాహం కారణంగా రోడ్డు ధ్వంసం అవుతోంది. గుంతలు ఏర్పడి మురుగు నిలుస్తోంది. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక్కడే పాఠశాలు, ఆస్పత్రులు ఉండడంతో విద్యార్థులు, ప్రజలు ముక్కుమూసుకొని వెళ్లాల్సి వస్తోంది.

కచ్చామోరీ కథ కంచికే..

పహాడీషరీఫ్ నుంచి ఎర్రకుంట వరకు ఉన్న చిన్నపాటి కచ్చామోరీ మట్టిలో కూరుకుపోయింది. దీంతో రోడ్డుపై మురుగు పారుతోంది. నాలుగేళ్ల క్రితం అప్పటి కమిషనర్ స్పెషల్ డ్రైవ్ చేపట్టి మూడు, నాలుగు రోజుల పాటు మోరీని అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేసినప్పటికీ పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేలేదు. ఆర్అండ్‌బీ పరిధిలో రోడ్డుకు ఇరువైపులా మోరీలు నిర్మించి, సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

దుర్వాసనతో ఇబ్బంది..



శ్రీశైలం ప్రధాన రహదారిపై నిత్యం మురుగు జలాలు పారుతున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు, బాటసారులు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి, సమస్యకు పరిష్కారం చూపాలి.
– సయ్యద్ హుస్సేన్, వాదేముస్తఫా బస్తీ

నియామకం



పాండు ముదిరాజ్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు

కందుకూరు: కందుకూరు మండల ముదిరాజ్ మహాసభ నూతన అధ్యక్షుడిగా ధన్నారం గ్రామానికి చెందిన పిట్టల పాండుముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలోని ముదిరాజ్ భవనంలో ఆ సంఘం సీనియర్ నాయకులు ఎడ్ల బాబురావు ముదిరాజ్, కాకి రాములు ముదిరాజ్, కాకి దశరథ ముదిరాజ్, కుర్వమోని జయేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకొని ప్రకటించారు. ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించినందుకు, సహకరించిన మహాసభ పెద్దలు, సభ్యులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారం కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనను సంఘం యూత్ అధ్యక్షుడు సురేందర్, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్, జంగయ్య, నాయకులు బాల్‌రాజ్, ఈసరి శ్రీనివాస్, నీలం యాదగిరి, యూత్ ప్రధాన కార్యదర్శి ఉదయ్, జి.యాదయ్య, జి.జంగయ్య, శ్రీశైలం, ఢిల్లీ శ్రీధర్, మహేందర్, పిట్టల బాల్‌రాజ్, కుమార్, శ్రీనివాస్, హరికిషన్, యాదగిరి, వెంకటేష్, శ్రీకాంత్, రాములు, సత్యనారాయణ, లింగం తదితరులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

వ్యర్థాల వాహనం అడ్డగింత

పహాడీషరీఫ్: రాజేంద్రనగర్ నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను తీసుకొచ్చి జల్‌పల్లి మున్సిపాలిటీలో డంప్ చేస్తున్న వాహనాన్ని బీఆర్ఎస్ పార్టీ స్థానిక నాయకులు ఆదివారం అడ్డుకున్నారు. కొన్ని రోజులుగా కొందరు కంపెనీలలోని ప్లాస్టిక్ వ్యర్థాలను తీసుకొచ్చి జల్‌పల్లి చెరువు ఒడ్డున కార్గో రోడ్డులో పడేస్తున్నారు. ఆదివారం కావడంతో మున్సిపల్ సిబ్బంది చూడరని భావించిన సదరు వ్యక్తులు.. బొలేరో ట్రాలీ ఆటో డ్రైవర్ వ్యర్థాలు పారబోస్తుండడాన్ని గమనించిన బీఆర్ఎస్ 18వ వార్డు నాయకుడు గుండు నర్సింగ్ స్థానిక యువకులు శ్రీకాంత్, కృష్ణలతో కలిసి ఆటోను అడ్డగించారు. అనంతరం మున్సిపల్ సూపర్‌వైజర్ కుమార్‌కు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు అక్కడికి చేరుకున్న మున్సిపల్ సిబ్బంది ఆటోను మున్సిపల్ కార్యాలయానికి తరలించారు.



వ్యర్థాలు తీసుకొచ్చిన వాహనం

ఇప్పటికే మున్సిపాలిటీలో ప్రజలు విషజ్వరాలతో బాధ పడుతుంటే అదనంగా బయటి ప్రాంతాల వ్యర్థాలను ఇక్కడ పడేయడం తగదని నర్సింగ్ మండిపడ్డారు. మున్సిపల్ సిబ్బంది ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాలని కోరారు.

అండర్ డ్రైనేజీ పనుల పరిశీలన



కాలువ పనులు పరిశీలిస్తున్న కౌన్సిలర్

ఆమనగల్లు: పట్టణంలోని 15వ వార్డు పరిధి ఉదయనగర్ కాలనీలో రూ.60 లక్షలతో నిర్మిస్తున్న భూగర్భ మురుగు కాలువ నిర్మాణ పనులను ఆదివారం కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీలో మురుగు కాలువ లేక, ప్రజలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో.. మున్సిపాలిటీకి టీయూఎఫ్ఐడీసీ నిధులు మంజూరు కాగా, అందులోనుంచి నిధులు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. అనంతరం నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. పనులు నాణ్యతగా చేపట్టి, సకాలంలో పూర్తిచేయాలని నిర్మాణదారుడికి సూచించారు. పుర సిబ్బంది షర్ఫుద్దీన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో అభివృద్ధి

కడ్తాల్: ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని నాయకులు అన్నారు. ఆదివారం మండల పరిధి చరికొండ గ్రామ పంచాయతీ బోయిన్ గుట్టతండా నుంచిముద్వీన్ గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధులు రూ.2 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టి, త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాములుగౌడ్, మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్, లక్ష్మయ్య, మహేందర్‌గౌడ్, భీష్మాచారి, అంజియాదవ్, యాదయ్య, హరిచంద్ర తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల అసంతృప్తి

కడ్తాల్: ఐదు వాయిదాల కరువు భత్యం(డీఏ) పెండింగ్‌లో ఉండగా, ప్రభుత్వం ఒక డీఏను విడుదల చేయడం బాధాకరమని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జంగయ్య అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. అధికారంలో వచ్చాక పదిహేను రోజుల్లో మూడు వాయిదాల డీఏను విడుదల చేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసి పదినెలలు గడిచినా.. ఒక డీఏను ప్రకటించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉద్యోగ సంఘాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్చలు జరిపిన అనంతరం.. రెండు వాయిదాల డీఏ అయినా ఇస్తారని ఉద్యోగులు బావించారని, ప్రభుత్వం ఒక్క డీఏ విడుదల చేయడంతో జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

కన్నవారికి సేవచేస్తే.. దేవుడికి చేసినట్లే



దుస్తులు పంపిణీ చేస్తున్న రంగరాజన్

ఇబ్రహీంపట్నం: 'కలియుగంలో భగవంతున్ని నేరుగా కొలువలేము. తల్లిదండ్రులకు సేవ చేస్తే.. భగవంతుడికి చేసినట్లే' అని చిలుకూరి బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ అన్నారు. ఆదివారం ఆయన వినోబానగర్ మాతాపితరుల సేవా సదనంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవసదనాలు ఉండటం మంచిదే అయినా.. పిల్లలు ఉండి.. కన్నవారిని వృద్ధాశ్రమంలో వదలడం బాధకరమన్నారు. తనవంతు సహాయంగా ఏటా ఆ అనాథ తల్లిదండ్రులకు సేవ చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌రావు, రాంచంద్రారెడ్డి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

మంచాల: మండల పరిధి ఆరుట్ల గ్రామంలోని సహకార బ్యాంకు ఖాళీ స్థలంలో రైతుల కోసం మినీ కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని సహకార బ్యాంక్ చైర్మన్ హన్మమంత్ రెడ్డి.. డైరెక్టర్లతో కలిసి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే.. బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతర ఏర్పాట్ల గురించి నాయకులతో చర్చించారు. అనంతరం ఎంపీడీఓ బాలశంకర్‌కు ఫోన్‌చేసి, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించినట్లు డైరెక్టర్లు పేర్కొన్నారు. మార్కెట్ ఏర్పాటు గురించి కలెక్టర్‌తో మాట్లాడి, ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, డైరెక్టర్ రాంరెడ్డి, సహకార బ్యాంక్ డైరెక్టర్ వెంకటేశ్, యాదవ్, మాజీ ఎంపీటీసీ నరేందర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

కడ్తాల్: ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపదలో ఉన్న పేదలకు వరమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధి పల్లెచెలక తండాకు చెందిన విస్లావత్ లచ్చి ఆరోగ్య సమస్యలతో నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. వైద్య ఖర్చులు అధికమవడంతో.. స్థానిక నాయకులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన సీఎం సహాయనిధి నుంచి రూ.3 లక్షల ఎల్‌ఓసీ చెక్కును మంజూరు చేయించారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో.. ఎల్‌ఓసీని గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు రమేశ్‌కు ఎమ్మెల్యే అందజేశారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్తఫా కమిటీ సభ్యులు

ఆమనగల్లు: గ్యార్మీషరీఫ్ వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని పీర్లమసీదు కాలనీ మహబూబా సుభాని దర్గా వద్ద అంజుమనే గులాబీ ముస్తఫా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవంలో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గా నుంచి గ్యార్మీ జెండాలతో భారీ ర్యాలీ తీశారు. అనంతరం దర్గాలో జెండాను ప్రతిష్ఠించారు. గురువు అఫీజ్ మౌలాన వాహేద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు, సలాం, దువా నిర్వహించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో జమా మసీదు కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మసూం, నాయకులు రజాక్, ఖాదర్, అజీం, ఇమ్రాన్, ముస్తఫా కమిటీ సభ్యులు అక్రం, అక్సర్, బాబా, అజహర్, అబ్బాస్, ఆరీఫ్, అమీర్, పాష, అసద్, అంజద్, గౌస్, రవూఫ్, ముజమ్మీల్, అబేద్, ముబాసిర్ తదితరులు పాల్గొన్నారు.

కోనాపూర్ రోడ్డుకు మహర్దశ



కోనాపూర్ గేటు- మాడ్గుల రోడ్డు

- రహదారి విస్తరణకు రూ.45 కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తంచేస్తున్న ప్రజలు

ఆమనగల్లు: కోనాపూర్ రోడ్డుకు మహర్దశ పట్టనుంది. మండల పరిధి హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారి కోనాపూర్ గేటు నుంచి మాడ్గుల మండల కేంద్రం వరకు బీటీరోడ్డు విస్తరణకు ప్రభుత్వం రూ.45 కోట్లు మంజూరు చేసింది. దీంతో పుష్కరకాలంగా రహదారి విస్తరణకు ఎదురు చూస్తున్న ప్రాంత ప్రజల కల నెరవేరినట్లయింది.

ఎమ్మెల్యే చొరవతో..

కోనాపూర్- మాడ్గుల పీఆర్ రోడ్డును రెండు దశాబ్దాల క్రితం ఆర్అండ్‌బీగా మార్చారు. అనంతరం బీటీరోడ్డును నిర్మించారు. కోనాపూర్ గేటు నుంచి కోనాపూర్, ఆకుతోటపల్లి, మాడ్గుల మండలం దొడ్లపహాడ్ మీదుగా మాడ్గుల మండల కేంద్రానికి 21 కి.మీ. రహదారి నిర్మించారు. అప్పటి నుంచి రోడ్డుకు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డు అధ్వానంగా మారింది. ఇదిలా ఉండగా.. ఈ మార్గం గుండా హైదరాబాద్ నుంచి ఆకుతోటపల్లి, దొడ్లపహాడ్, గౌరారం తదితర గ్రామాలకు వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. రద్దీ ఎక్కువ కావడంతో రోడ్డును విస్తరించాలని ఆమనగల్లు, మాడ్గుల మండలాల ప్రజల నుంచి డిమాండ్ పెరిగింది. ప్రజా రవాణాను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిధులు మంజూరు చేశారు.

పనులు త్వరగా చేపట్టాలి



కోనాపూర్- మాడ్గుల మండల కేంద్రం వరకు నిర్మించే డబుల్ రోడ్డు నిర్మాణ పనులను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలి. ఏళ్లుగా ఎలాంటి మరమ్మతులకు నోచుకోకుండా ఉన్న రోడ్డు.. ఇప్పటికైనా విస్తరణకు నోచుకోవడం సంతోషంగా ఉంది. ప్రజల రవాణా కష్టాలు తీరుతాయి.
– యాదిలాల్, టీడీపీ, కల్వకుర్తి ఇన్‌చార్జి, కోనాపూర్

కృతజ్ఞతలు



రోడ్డు విస్తరణకు నోచుకోవడం ఆనందంగా ఉంది. ఇంతకాలం వాహనదారులు, ప్రయాణికులు పడిన కష్టాలు రోడ్డు నిర్మాణంతో తీరుతాయి. ప్రజల కష్టాలను గమనించి రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి కృతజ్ఞతలు.
– శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, ఆకుతోటపల్లి

'ఆత్మగౌరవ' సభకు తరలిన నేతలు



ఆమనగల్లు: సభకు వెళ్లిన నాయకులు

ఆమనగల్లు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆదివారం మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించిన మాలల ఆత్మగౌరవ సభకు పట్టణం నుంచి మాలలు తరలివెళ్లారు. అంతకు ముందు మహానాడు నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగానికి వ్యతిరేకంగా సుప్రీం ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరారు. మాలలను ఓటు బ్యాంకుగా చూసే పార్టీలకు బుద్ధి చెప్పడానికి, మాలల ఐక్యత తెలిపేందుకు ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. సభకు వెళ్లినవారిలో మహానాడు నాయకులు కాలె మల్లయ్య, లండం చంద్రయ్య, గోరటి నర్సింహ, చెన్నకేశవులు తదితరులు ఉన్నారు.

కందుకూరులో..



కందుకూరులో.. అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

కందుకూరు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నాగర్‌కర్నూల్‌లో ఆదివారం నిర్వహించిన మాల మహానాడు ఆత్మగౌరవ సభకు ఆదివారం మండలం నుంచి ఆ సంఘం నాయకులు తరలివెళ్లారు. చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం సభకు బయలుదేరారు. కార్యక్రమంలో మాల మహానాడు సంఘం నాయకులు గాదె కుమార్, గాదె యాదగిరి, శేఖర్, రాజు, పి.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.